క్లుప్తంగా

నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): గణనాథుడి విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కార్పొరేషన్ ఆధ్వర్యంలో పక్కాగా ఏర్పాట్లు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలోని నిమజ్జన ఘాట్ వద్ద సౌకర్యాలను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఘాట్ వద్ద భారీ క్రేన్లు, మరబోట్లు, బ్యారికేడ్లు, రాత్రి వేళ లైటింగ్, సీసీ కెమెరాలతో నిఘా పర్యవేక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ నిమిత్తం మైక్ అనౌన్స్‌మెంట్, తదితరాలను ఏర్పాటు చేశామని వివరించారు. పారిశుధ్య విభాగ ఆధ్వర్యంలో కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను కేటాయించి ట్రాక్టర్లతో చెత్త సేకరణ, ఘాట్ ప్రాంగణం నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. నిమజ్జనం చేసే చెరువులో వ్యర్థాలు వేయకుండా భక్తులకు సూచనలు చేయాలని ఆదేశించారు.

యాచకులకు పునరావాస కేంద్రాలు

కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన స్మైల్ - 75 కార్యక్రమంలో భాగంగా నగరంలోని యాచకులకు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేసి, వాటి అమలుకు సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు సంస్థల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని నగరాల్లో యాచకుల పునరావాస కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని వివరించారు.

ఉద్యోగికి ఆర్థిక సాయం

నెల్లూరు(పొగతోట): అనారోగ్యంతో బాధపడుతున్న జెడ్పీ కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ షాకీరాబానుకు తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. జెడ్పీ ఉద్యోగులు, మండల పరిషత్ సిబ్బంది, జెడ్పీ పాఠశాలల నాన్ టీచింగ్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులు తమ వంతు సాయంగా రూ.1.33 లక్షలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని షాకీరాబానుకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ చిరంజీవి చేతుల మీదుగా అందజేశారు. పంచాయతీ రాజ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్కాకుల పెంచలయ్య, రమేష్‌బాబు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు భీమిరెడ్డి, మాబాషా, షాకీర్ అహ్మద్, జెడ్పీ ఏఓలు శైలజ, కొండయ్య, అష్రఫ్ పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

నెల్లూరు (టౌన్): గురజాడ అప్పారావు గొప్ప దార్శనికుడని సాహిత్య సురభి స్థాపక అధ్యక్షుడు, న్యాయవాది కల్యాణరామారావు పేర్కొన్నారు. గురజాడ జయంతిని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. అనంతరం కల్యాణ రామారావును సత్కరించారు. ప్రిన్సిపల్ గిరి, అరసం గౌరవాధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, అధ్యాపకులు కరుణశ్రీ, సుభాషిణి, సత్యనారాయణ, ఈశ్వరమ్మ, పరిశోధక విద్యార్థులు వెంకటరమణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ప్రధానోపాధ్యాయులు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చైతన్య సదస్సులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేసి.. నియోజకవర్గాల వారీగా చైతన్య సదస్సులను నిర్వహించనున్నామని సంస్థ వ్యవస్థాపకుడు పందిటి సుబ్బయ్య పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. చైతన్య సదస్సుల అనంతరం నగరంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని దళితుల అభ్యున్నతికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. దళితుల కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, నేతలు వెంకట్రావు, కన్యకేశ్వరరావు, చిన్నా, కామేష్, రాజు, సూరి, తాతారావు, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ పురుషులు, మహిళా జట్లను వీఆర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో శుక్రవారం సాయంత్రం ఎంపిక చేయనున్నామని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదంశెట్టి వాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరులో ఈ నెల 29 నుంచి అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్న సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో జిల్లా తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు. ఎంపికలకు హాజరుకావాలనుకునే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 94408 79884 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వల్లూరులో అభివృద్ధి పరుగులు

- రూ.1.17 కోట్లతో బీటీ రోడ్డు
- రూ.40 లక్షలతో సచివాలయం
- పశు వైద్యశాలకు రూ.10 లక్షలు

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు పంచాయతీ వివిధ అభివృద్ధి పనులతో సరికొత్త శోభను సంతరించుకుంటోంది. సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలతో కళకళలాడుతున్నాయి. వల్లూరు గ్రామంలో 100 పక్కాగృహాలతో జగనన్న కాలనీ ఏర్పాటవుతోంది. అన్ని సామాజిక వర్గాలకు ఈ లేఅవుట్‌లో పక్కా గృహాలు మంజూరయ్యాయి.



సుందరంగా చుట్టుగుంట రోడ్డు



జగనన్న కాలనీలో నిర్మాణంలో గృహం



నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం

అభివృద్ధి ఇలా..

- ఇక్కడి పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ తరుణంలో ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు నూతన భవనానికి రూ.పది లక్షలను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంజూరు చేశారు. దీనికి శంకుస్థాపనను సైతం చేపట్టారు.
- రామాపురంలో రూ.40 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం జరుగుతోంది.
- గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు బండ్లపాళెంలో రూ.ఐదు లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.
- నాడు – నేడు కింద ప్రాథమిక పాఠశాలకు పలు సౌకర్యాలతో పాటు ప్రహరీని నిర్మించారు.
- గ్రావెల్ రోడ్డు ఉన్న పలు గ్రామాల్లో సుందరమైన బీటీ రోడ్లను నిర్మించారు. దువ్వూరువారిపాళెం నుంచి చుట్టుగుంట మీదుగా పచ్చికాయల మిట్ట వరకు రూ.1.17 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీన్ని మంత్రి ఇటీవలే ప్రారంభించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వల్లూరు పంచాయతీలో అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. అర్హులందరికీ నివేశన స్థలాలు, పక్కా గృహాలు మంజూరయ్యాయి.

– పోచారెడ్డి చెంగారెడ్డి, రామాపురం

రూ.20 లక్షలతో రోడ్లు



పంచాయతీకి అవసరమైన పనులను పార్టీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామపెద్దల సహకారంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంజూరు చేశారు. పొలాలకు రైతులు వెళ్లే మార్గాల్లో రూ.20 లక్షలతో నాలుగు గ్రావెల్ రోడ్లను నిర్మించాం.

– పల్లికొండ పెంచలప్రతాప్, సర్పంచ్

అడిగిన పనులను పూర్తి చేశారు



వల్లూరు పంచాయతీలో అవసరమైన అభివృద్ధి పనులు సజావుగా జరిగాయి. అడిగిన అభివృద్ధి పనులను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంజూరు చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో కోరిన పనులను పూర్తి చేశారు.

– దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నేత

క్రీడాకారులకు క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న నిర్మలమ్మ

పొదలకూరు: క్రీడాకారులకు క్రమశిక్షణ తప్పక ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో ఐదు మండలాల అండర్ – 14, 17 క్రీడా పోటీల ప్రారంభ సమావేశాన్ని స్థానిక డీఎన్నార్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చదువుకున్న పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి అనుమతితో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను త్వరలో ఇక్కడ నిర్వహించనున్నామని వెల్లడించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంఈఓ శేషాద్రివాసు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, వార్డు సభ్యుడు వాసుదేవరావు, ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు, హెచ్ఎంలు సనత్‌కుమార్, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై అత్తింటి వారు దాడి చేసిన ఘటనపై సంతపేట పోలీసులు విచారణ జరుపుతున్నారు. వారి కథనం మేరకు.. కాకినాడ జిల్లా తునికి చెందిన డాక్టర్ శివప్రసాద్‌కు నగరానికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ కుమార్తెతో సుమారు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. కుటుంబ కలహాల నేపథ్యంలో 2021లో దంపతులు విడిపోయారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది. ఈ క్రమంలో కోర్టుకు హాజరయ్యేందుకు గానూ నగరానికి వచ్చిన శివప్రసాద్ బృందావనంలోని ఓ లాడ్జిలో బస చేశారు. అనంతరం కోర్టుకు హాజరయ్యారు. అక్కడ ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. అనంతరం లాడ్జి వద్దకు ఆయన వచ్చేశారు. ఈ నేపథ్యంలో అత్తింటి వారు తనపై దాడి చేశారంటూ సంతపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయాత్ర, నిమజ్జనానికి ఏర్పాట్లు

నెల్లూరు(బృందావనం): వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నగరంలో శోభాయాత్ర, నిమజ్జనాలకు ఏర్పాట్లను పూర్తి చేశామని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. నగరంలోని టీవీఎస్ కల్యాణసదన్‌లో విలేకరుల సమావేశంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు సత్యనాగేశ్వరరావు మాట్లాడారు. పలు ప్రాంతాల్లో గణేశ్ శోభాయాత్రకు స్వాగత కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి మాట్లాడారు. గణేశ్ ఘాట్ సమీపంలోని స్వర్ణలింగేశ్వరస్వామి దేవస్థానంలో తాత్కాలిక బంక మట్టి మహాగణేశునికి పూజా కార్యక్రమాలను శనివారం సాయంత్రం 4.30కు నిర్వహించనున్నామని వివరించారు. హరిద్వార్ తరహాలో గంగాహారతి, పవిత్ర గంగాజలాన్ని డ్రోన్ల ద్వారా భక్తులపై ప్రోక్షణ చేయనున్నామని తెలిపారు. గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి ఆశీస్సులను అందజేయనున్నారని తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వారానికోసారి ఆరోగ్య మేళా

పొదలకూరు: ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా వారానికోసారి ఆరోగ్య మేళాను నిర్వహించనున్నామని పొదలకూరు సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో చిన్నపిల్లలకు వైద్య పరీక్షల నిమిత్తం మేళాను గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అక్టోబర్ రెండో తేదీ వరకు వైద్య మేళాను నిర్వహించనున్నామని వెల్లడించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేయనున్నామని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి వైద్య పరీక్షలు చేశారు.



మాట్లాడుతున్న ప్రసాద్

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వాకాటి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్లు పద్మావతి, శివకృష్ణ, నజ్మా సుల్తానా, నవీన్‌కృష్ణ, స్రవంతి, రాధ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వెంకటాచలం: చీరల పంపిణీ



మనుబోలు: బద్దెవోలులో..



ముత్తుకూరు: ఆర్ అండ్ ఆర్ కాలనీలో..

వెంకటాచలం: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కసుమూరులో 16 మందికి సీమంతాలు చేసి చీరలను పంపిణీ చేశారు. సర్పంచ్ కడివేటి శివ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: తక్కువ ఖర్చుతో పౌష్టికాహారాన్ని తయారు చేసుకోవచ్చని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు అవసరమైన వంటకాలను చేసి చూపించారు. టీచర్లు రాజేశ్వరి, లక్ష్మి, ఆదిలక్ష్మి, సుగుణమ్మ, శ్రీవల్లి, సుభాషిణి, కరీమా, నాగమణి, సుప్రజ, శైలజ, విజయకుమారి పాల్గొన్నారు.

మనుబోలు: పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పేర్కొన్నారు. పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని బద్దెవోలు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారాన్ని ఎలా తయారు చేయాలో వివరించారు. ఎమ్మెస్కే హర్షవీణ తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో బీఎస్సీ హానర్స్ కెమిస్ట్రీ కోర్సు

నెల్లూరు (టౌన్): ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ హానర్స్ నాలుగో సంవత్సర కెమిస్ట్రీ కోర్సును ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల బీఎస్సీ కోర్సులో కెమిస్ట్రీ చదివిన విద్యార్థినులు, సబ్జెక్టుల్లో 75 శాతం మార్కులు సాధించిన వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కోర్సు పూర్తి చేసిన వారికి వర్సిటీలో నేరుగా ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం ఉంటుందని వివరించారు. వర్సిటీలో రీసెర్చి చేసేందుకు అర్హులని, వివరాలకు 94405 06633 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘన సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్ రమణాదేవి, జనరల్ మేనేజర్ వెంకటసుబ్బయ్యను జిల్లా విద్యుత్ శాఖ అధికారులు సత్కరించారు. నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, టెక్నికల్ ఈఈ బాలచంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ భాగస్వామిగా ఎస్ఈఐఎల్

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



సంస్థ సీఈఓకు జ్ఞాపికను అందజేస్తున్న సుందరవల్లి

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద గల విక్రమ సింహపురి యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణ భాగస్వామిగా ఎస్ఈఐఎల్ సంస్థను గుర్తిస్తున్నామని వర్సిటీ వీసీ సుందరవల్లి తెలిపారు. వీఎస్‌యూకు న్యాక్ ఏ గ్రేడ్ లభించడంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు ఎంతో దోహదం చేశాయి. ఈ క్రమంలో సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది వర్సిటీకి గురువారం వచ్చి వీసీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. యూనివర్సిటీలో పర్యావరణ పరిరక్షణతో పాటు సోలార్ సిస్టమ్, సోలార్ హీటర్లను సంస్థ అందించిందని చెప్పారు. వారి సహకారానికి కృతజ్ఞతలను తెలియజేశారు. వర్సిటీ అభివృద్ధికి తమ సంస్థ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని రాఘవ్ త్రివేది తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు ఎమ్మెల్యే భరోసా



కోవూరు: పట్టణంలోని పలు చిన్నారుల భవిష్యత్తుకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోవూరు పంచాయతీలోని పూనూరు వారి వీధిలో పర్యటిస్తుండగా, కొన్ని కుటుంబాల్లో తల్లి, తండ్రిని కోల్పోయిన చిన్నారులను గమనించిన ఆయన వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సాయి కనిష్కకు రూ.20 వేలను నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి ఆ పత్రాలను కుటుంబసభ్యులకు రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి సమక్షంలో ఇచ్చారు. మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, మండల పంచాయతీ విభాగ అధ్యక్షుడు వేమారెడ్డి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెంలో అన్నదానం



కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం): వినాయక చవితిని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని విద్యా సదన్ వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద అన్నదానాన్ని గురువారం నిర్వహించారు. తొలుత పూజలు చేశారు. ఉభయకర్తలుగా మధుబాబు, సుప్రియ దంపతులు వ్యవహరించారు. అనంతరం లడ్డూ వేలాన్ని నిర్వహించగా, రూ.8001కు వీరు దక్కించుకున్నారు. జయవర్ధన్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్, గుణశేఖర్, ప్రసాద్, రిషికేష్, విష్ణువర్ధన్, కృష్ణ, వంశీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



కోవూరు: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు విషయమై సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శాసనసభలో గురువారం కలిశారు. ఈ మేరకు శాసనసభ సమావేశాల్లో సీఎంను కలిశానని ఎమ్మెల్యే చెప్పారు.

చేతివృత్తులకు ప్రభుత్వ చేయూత

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): చేతి వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో అర్బన్ మార్కెట్ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి స్టాళ్లను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు చేయూతనివ్వాలన్నారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని చెప్పారు. మహిళాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, మెప్మా పీడీ రవీందర్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎం లలిత, సీసీ ఖాజామస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



మనుబోలు: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మండల కేంద్రమైన మనుబోలులోనే 20కుపైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. వాడవాడలా నెలకొల్పిన గణనాథుడి మండపాల వద్ద సందడి వాతావరణం కొనసాగుతోంది. బొజ్జ గణపయ్యకు ధూపదీప నైవేద్యాలతో నిత్యం పూజలు చేస్తున్నారు. గ్రామోత్సవం అనంతరం సమీపంలోని వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు.

సాయినాథుడికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల భజనలు, పల్లకిసేవను రాత్రి నిర్వహించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ గిరీష్ గాంధీ కేఎల్‌ఈఎఫ్ వర్సిటీ, విజయవాడ నుంచి పీహెచ్‌డీ పొందారు. డిజైన్ సిమ్యులేషన్, మోడలింగ్ అండ్ అనాలసిస్ వేరియస్ స్విచెస్ ఫర్ – 3 అప్లికేషన్స్‌కు పీహెచ్‌డీ లభించింది. కేఎల్ఈఎఫ్ వర్సిటీ విభాగ ప్రొఫెసర్ గోవర్ధిని పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. కాగా గిరీష్ గాంధీని కళాశాల చైర్మన్ గుణశేఖర్ గురువారం అభినందించారు.